


## మైనర్లు వాహనాలు
# నడిపితే కేసులు

- మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరం..
- 295 కుటుంబాలకు కౌన్సెలింగ్
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
ఆదివారం | 4 మే 2025 | 9 పేజీలు






# మామిడి రైతు దిగాలు..!

■ మంచిర్యాల ప్రతినిధి, ప్రభాత సమాచారం

- మామిడి రైతు కుదేలు ■ ఈదురు గాలులకు రాలిన మామిడి కాయలు ■ విలవిల్లాడుతున్న మామిడి రైతులు
- మంచిర్యాల జిల్లాలో వేల ఎకరాల్లో మామిడి సాగు ■ అకాల వర్షాలతో ఆగమాగం ■ చీడపీడలతో, వాతావరణ మార్పులతో తగ్గిన దిగుబడి
- మామిడి రైతును వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు ■ ప్రతీ యేటా తప్పని నష్టాలు ■ ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు..

ప్రకృతి వైపరిత్యాలతో మామిడి రైతు కుదేలు అవుతున్నాడు. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలకు మామిడి రైతుల ఆశలు నేలరాలుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో పలు పర్యాయాలు ఈదురు గాలులు, వర్షాల వల్ల చేతికందుతున్న మామిడి కాయలు నేలరాలి రైతులు లబోదిబోమంటున్నారు. పూత దశలో మామిడి పంటకు వ్యాపించిన చీడపీడల వల్ల అసలే దిగుబడితగ్గి దిగాలుతో ఉన్న రైతులను అకాల వర్షాలు ఉన్నది కాస్తా ఊడేస్తుండడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మంచిర్యాల జిల్లాలో పదిహేను రోజులుగా మూడు పర్యాయాలు ఈదురు గాలులు, అకాల వర్షాలు కురవడంతో మామిడి కాయలు రాలిపోయి రైతులు దిగులు చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా నెన్నెల, బెల్లంపల్లి, మందమర్రి, భీమారం, జైపూర్ మండలాలు మామిడి తోటలకు ప్రసిద్ధి. ఇక్కడ మామిడి కాయలు మన రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. కొద్ది సంవత్సరాలుగా ప్రకృతి మామిడి రైతులపై పగ పట్టినట్లుగా చేతికొచ్చిన పంట కాస్తా నేల రాలి కన్నీరు మిగిలిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

7లో




## నాణ్యమైన విద్య, వైద్యం
# అందిచడమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరింత మెరుగైన వైద్య సేవలు ■ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు
- లక్షెట్టిపేటలో ప్రభుత్వాసుపత్రి, ఉన్న పాఠశాల, కళాశాల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్

నియోజకవర్గ ప్రజలకు మంచి నాణ్యమైన వైద్యంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన కార్పోరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే ధ్యేయమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం లక్షెట్టిపేట పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనంతో పాటు ప్రభుత్వ కళాశాల భవనాల నిర్మాణం పనులను జిల్లా కలెక్టర్ కు మార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కూడా విద్య, వైద్య రంగంపై ప్రత్యేక దృష్టితో ముందుకు సాగుతుందన్నారు.

## ఆదిలాబాద్‌లో ప్రేమజంట
# ఆత్మహత్యాయత్నం

6లో

- పెళ్లయిన వారం రోజులకు పురుగుల మందు తాగి..
- గమనించిన స్థానికులు.. రిమ్స్ ఆస్పత్రికి తరలింపు
- నిర్మల్ జిల్లాకు చెందిన వారిగా గుర్తింపు





## దారిదోపిడీ కేసులో..
# నలుగురి అరెస్టు

- ఆగి ఉన్న లారీ అద్దాలు పగులగొట్టి ఆరున్నర వేల దోపిడీ
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఏఎస్పీ కాజల్ సింగ్ వెల్లడి -3లో



## ఉగ్రదాడికి నిరసనగా
# మంచిర్యాల బంద్

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడిని ఖండిస్తూ హిందూ సంఘాల ఐక్యవేదిక, ఛాంబర్ ఆఫ్ కామర్స్, కుల, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో చేపట్టిన మున్సిపల్ కార్పొరేషన్ బంద్ విజయవంతమైంది. వ్యాపార సంస్థలు, సినిమా టాకీ స్‌లు, హెూటళ్లు, పెట్రోల్ బంక్‌ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఉదయం నుంచి తమ వ్యాపార సంస్థలన్నింటినీ మూకుమ్మడిగా మూసి ఉంచారు. పట్టణంలో షాపులన్నీ మూసి ఉండటంతో పట్టణంలోని ప్రధాన వీధులన్నీ బోసిపోయాయి. బంద్ సందర్భంగా హిందూ ఐక్యవేదిక, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, ఉగ్రవాదుల వైఖరి పట్ల తమ నిరసనను తెలియజేశారు.

వివరాలు 9లో



### రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థినుల

# కుటుంబానికి కేటీఆర్ భరోసా




- విద్యార్థుల మృతి కలిచివేసింది
- వారి కుటుంబానికి అండగా ఉంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- మృతుల తండ్రిని బాణావత్ రెడ్డిని స్వదేశానికి రప్పించేందుకు ఏర్పాట్లు
- అక్కాచెల్లెళ్ల మృతితో కన్నీటి వీడ్కోలు పలికిన లోతర్య తండా వాసులు..
- అంత్యక్రియల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్

**నిర్మల్, మే 3 (ప్రభాత సమాచారం)**

పెంబి మండలం లోతర్య తండాకు చెందిన అక్కాచెల్లెలు బాణావత్ మంజుల, బాణావత్ అశ్వినీలు ఎంసెట్ పరీక్ష రాసి తిరిగు ప్రయాణంలో శుక్రవారం ఆర్మూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. బాధిత కుటుంబానికి పూర్తిగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుల తండ్రి బాణావత్ రెడ్డి ఉపాధి నిమిత్తం మలేషియాలో ఉన్న విషయం తెలుసుకున్న కేటీఆర్, వెంటనే ఆయన తెలంగాణకు రప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. అంతేకాదు.. కేటీఆర్ ఆదేశాల మేరకు ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ అర్ధరాత్రి సమయంలోనే ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వైద్యులు, పోలీసులు, అధికారులతో మాట్లాడారు. మరణాంతర ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం మృతదేహాలను అంబులెన్స్ ద్వారా స్వగ్రామం లోతేర తండాకు తరలించి, అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. 'చిన్నవయసులో ప్రాణాలు కోల్పోయిన మంజుల, అశ్వినీలు ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థినులు. వారి మరణం మా అందరికీ తీరని గాయం. తండ్రి విదేశాల్లో ఉండటంతో కుటుంబం తీవ్ర బాధలో ఉంది. కేటీఆర్ ఆదేశంతో తండ్రి తిరిగి రావడానికి ఏర్పాట్లు వేగంగా జరిగాయి' అని పేర్కొన్నారు.

**విద్యార్థినులకు అశ్రునివాళి..**

పెంబి మండలం లోతర్య తండాకు చెందిన అక్క చెల్లెలు శక్రవారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించగా, పెంబి మండలం శోకసముద్రంలో మునిగింది. బాణావత్ మంజుల, బాణావత్ అశ్వినీలు ఎంసెట్ పరీక్ష రాసి తిరుగు ప్రయాణంలో ఆర్మూర్ పట్టణంలో రోడ్డు ప్రమాదంలో మరణించగా, వారు పెంబి మండలానికి చెందిన వారు, కాగా వారి కుటుంబం, బంధువులు, ఈ ప్రాంతమంతా విషాదఛాయలు అలముకున్నాయి. ఈ సందర్భంగా ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య ఝాన్సన్ నాయక్ శనివారం వారి అంత్యక్రియలో పాల్గొని నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి ఆర్థిక సహాయం అందించారు. అంత్యక్రియలకు తండ్రా వాసులు పెద్దఎత్తున తరలివచ్చారు.



**సంతాపం తెలిపిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

పెంబి మండలం లోతర్య తండాకు చెందిన అక్కాచెల్లెలు బాణావత్ మంజుల, బాణావత్ అశ్వినీలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం దురష్టకరమని, చదువులు రాణిస్తూ ఉజ్వల భవిష్యత్తు ఉన్న అక్కాచెల్లెలు పరీక్ష రాసి వస్తుండగా మృతి చెందడం బాధకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాడ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.



---



### రైతుల సంక్షేమానికి

# రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**ఉట్నూర్, మే 3 (ప్రభాత సమాచారం)**

రైతుల సంక్షేమ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని బిర్సాయిపేట గ్రామంలో శిరిడి సాయిబాబు మహిళ సమాఖ్య భూపేట, బిర్సాయిపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు అందించడం జరుగుతుందన్నారు. నేడు మహిళ సంఘాలకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అప్పగించామన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు.

## 'దోస్త్' ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలి

**నిర్మల్, మే 3 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో 2025-28 విద్యా సంవత్సరం గాను ప్రవేశాల కోసం దోస్త్ అప్లికేషన్ ఆన్లైన్ విడుదల చేయడం జరిగిందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు అందరూ కూడా డిగ్రీ కళాశాలలో ప్రవేశ పొందేందుకు అప్లికేషన్ చేసుకున్న వారికి మెరిట్ మార్కులు ఆధారంగా వివిధ కళాశాలలో ప్రవేశాలు ఉంటాయని ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఏ డిగ్రీ కళాశాలలోనైనా చేరేందుకు దోస్త్ అప్లికేషన్ ఉపయోగపడుతుందన్నారు.

---

# పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి




- వయసు పైబడిన సిబ్బందికి యోగ సాధన
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

పోలీస్ శాఖలో సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. ప్రతి శనివారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సిబ్బంది ప్రతి ఒక్కరికి పరేడ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో సిబ్బందికి సత్సంబంధాలు మెరుగుపడతాయని, అదే విధంగా సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వ్యాయామం చేస్తూ ఉండాలని తెలిపారు. శనివారం పోలీస్ పరేడ్ మైదానంలో పరేడ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిని పరిశీలించారు. ముందుగా రిజర్వ్ ఇన్స్పెక్టర్ మురళి జిల్లా ఎస్పీకి ఏడు ప్లాటూన్‌లతో కూడిన పరేడ్‌లో విడతల వారీగా ప్రత్యేక గౌరవ వందన సమర్పించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పరేడ్ వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచిస్తూ, సిబ్బంది విధుల్లో చెడు వ్యసనాలను సేవించకుండా ఉండాలని సూచించారు. పోలీసు వ్యవస్థకు క్రమశిక్షణ తప్పనిసరని, క్రమశిక్షణను ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. సిబ్బంది పరేడ్ మరింత ఉత్సాహంగా నిర్వహించాలని సూచించారు. అదే విధంగా ఇతర, తెలియని వ్యక్తులకు పూచికత్తులు (షూరిటీ) ఇవ్వకుండా ఉండాలని తెలిపారు. 50 ఏళ్లుపై బడిన సిబ్బందికి ప్రత్యేకంగా పరేడ్ కు బదులు యోగ శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. ఇందులో అదనపు ఎస్పీ బి. సురేందర్ రావు, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్, ఫణిధర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మురళి, శ్రీపాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

---

# డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మే 3 (ప్రభాత సమాచారం)**

విద్యా సంవత్సరంలో శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ మహిళ సాంకేతిక శిక్షణ సంస్థ - హైదరాబాద్లో డిప్లొమా కోర్సులలో ప్రవేశం కొరకు అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన, నిరుపేద కుటుంబాలకు చెందిన అణిచివేతకు గురైన, ఇతర బాధిత బాలికలు, సిసిఐలో నివసిస్తున్న బాలికల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాలలో ఒక్కొక్క విభాగంలో కేటాయించబడిన 60 సీట్లలో 70 శాతంతో 42 సీట్లు రిజర్వేషన్ కల్పించడం జరిగిందని, ఎస్.ఎస్.సి. ఉత్తీర్ణులై ఆర్ఫన్ సెమీ ఆర్ఫన్, బి.పి.ఎల్, డిస్టిట్యూట్, విక్టిమ్స్ ఆఫ్



ట్రాఫికింగ్ - ఇన్మేట్స్ ఆఫ్ హోమ్స్, ఉమెన్ ఇన్స్టిట్యూషన్స్ వారికి రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపారు. ఆయా విభాగాలలో ప్రవేశం కొరకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా బాలల సంరక్షణ విభాగం- బాలరక్షా భవన్‌లో సంప్రదించాలని, వివరాలకు 9908541697, 9441506519 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

---

# అర్హులైన వారికి రేషన్ కార్డులు

**మంచిర్యాల, మే 3 (ప్రభాత సమాచారం)**

రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్దిదారులకు రేషన్ కార్డు జారీ చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పెండింగ్ లో ఉన్న నూతన రేషన్ కార్డులు, కార్డులలో సభ్యులను చేర్చడంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తులను సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారిని ఎంపిక చేసి జిల్లాలో 956 నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డులలో పిల్లలను చేర్పించుట, ఇతర మార్పులకు సంబంధించి 29 వేల 237 దరఖాస్తులు విచారించి ఆమోదించడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, మీ-సేవలో దరఖాస్తు చేసుకోవచ్చని, అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్దిదారుల ఎంపికకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



## వేసవి శిక్షణా శిబిరాన్ని
# సద్వినియోగం చేసుకోవాలి

■ శిక్షణా శిబిరాలు మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతో దోహదపడుతాయి
■ జిల్లా స్థాయి బాలికల వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మే 3 (ప్రభాత సమాచారం)**
వేసవి సెలవులలో విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందిస్తూ పాఠ్య, పాఠ్యేతర అంశాలను అందిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బాలికల వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, స్పీడ్ మాథ్స్, డాన్స్, మ్యూజిక్, యోగ, మెడిటేషన్, కంప్యూటర్ కోడింగ్, పెయింటింగ్ మొదలైన అంశాలలో శిక్షణ అందించేందుకు శిబిరం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని, ఈ నెల 17వ తేదీ వరకు 15 రోజుల పాటు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఒక బృందం, వ్యవస్థను సమర్థవంతంగా నడిపించే వ్యక్తి నాయకుడని, విద్యార్థులు చిన్నతనం నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని అన్నారు. క్రీడలు, ఇతర రంగాలలో జట్టులో ఉన్న సభ్యులందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే విజయం సాధించవచ్చని అన్నారు. ప్రతి రోజు కొత్త విషయాలను నేర్చుకోవాలని, వేసవి శిక్షణ శిబిరాలలో విద్యార్థులకు కొత్త విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. మనం నేర్చుకునే అంశాలను నిశితంగా పరిశీలిస్తే విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని, ప్రజా ప్రయోజనకరంగా వినూత్న ఆవిష్కరణలు రూపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు. ఒక సమస్యను అనేక దారులలో పరిష్కరించవచ్చని, చివరగా పూర్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యమని అన్నారు. క్రీడలు, సంగీతం, చిత్రలేఖనం ఇతర రంగాలలో ప్రయత్నించడమే తొలి విజయమని, ఏకాగ్రత, ఇష్టంతో నేర్చుకుంటే నైపుణ్యత సాధించవచ్చు అని అన్నారు. ఏ అంశంలోనైనా నిరంతరం ప్రయత్నిస్తుంటే ఆ రంగంలో రాణించవచ్చని, ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే క్రమశిక్షణ, చిత్తశుద్ధితో ప్రయత్నించాలని తెలిపారు. జిల్లాలోని 18 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల నుండి దాదాపు 200 మంది విద్యార్థినులను తీసుకురావడానికి ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణ మూర్తి, నస్పూర్ మండల విద్యాధికారి దామోదర్ రావు, శిబిరం సమన్వయకర్త, నస్పూర్ ప్రత్యేక అధికారి మౌనిక సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### దారి దోపిడి కేసులో
## నలుగురు యువకుల అరెస్ట్

**ఇచ్చోడ, మే 3 (ప్రభాత సమాచారం)**



దారి దోపిడీకి పాల్పడిన కేసులో నలుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ ఫురాన్ అలీ ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిందితులు నలుగురు పట్టుబడ్డారని అన్నారు. పట్టుబడిన నిందితులలో ఇచ్చోడకు చెందిన షేక్ సోహెలుద్దీన్, డ్రైవర్, మండలంలోని అడేగాంకు చెందిన సలాం శ్రావణ్ కుమార్, మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన షేక్ రహిల్ షేక్ గఫార్, ఇదే మండలంలోని సిరిచెల్మ గ్రామానికి చెందిన సలాం ఏ అబ్దుల్ యాసిర్‌లు ఉన్నారని ఆమె వెల్లడించారు. నలుగురు నిందితులు ఈ నెల 2న హర్యానా దాబా వద్ద ఆగి ఉన్న లారీ అద్దాలను పగలగొట్టి బాధితుడి వద్ద నుంచి ఆరున్నర వేల రూపాయలను దారిదోపిడి చేశారని ఏఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. నిందితులను పట్టుకుని అరెస్టు చేశామని తెలిపారు. నిందితులపై ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. తప్పు చేసే వారిని ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. యువతను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని, చెడుమార్గంలో ప్రయాణించకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. చదువ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకొవద్దన్నారు.

# తాగునీటి సమస్యను పరిష్కరించండి

**మందమర్రి, మే 3 (ప్రభాత సమాచారం)**



మండలంలోని పొన్నారం గ్రియన్సింలోని 1వ వార్డులో నెల కొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడారు. గత రెండు నెలలుగా కాలనీకి తాగు నీటి సరఫరా లేకపోవడంతో కాలని వాసులు తాగు నీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని కాలని వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు సరఫరా చేస్తున్న పైపు లైన్లను తవ్వడంతో తాగు నీటి సరఫరా నిలిచి పోయిందని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని కార్యదర్శికి విన్నవించినప్పటికి ఆయన పట్టించుకున్న దాఖలాలు లేవని వారు మండిపడ్డారు. మండల అదికారులు స్పందించి ప్రస్తుత వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గిరిధర్ రావు కు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బొక్కల భవాని, దేవమ్మ, భారతి, లక్ష్మి, బొర్లకుంట మధులత, మల్లేపల్లి రాజక్క, గోదారి విజయ పాల్గొన్నారు.




### చివరి గింజ వరకు
## కొనుగోలు చేస్తాం
#### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్

**మంచిర్యాల, మే 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 341 కేంద్రాలు ప్రారంభించి ఇప్పటి వరకు 160 కొనుగోలు కేంద్రాల ద్వారా 4 వేల 335 మంది రైతుల వద్ద నుండి 37 వేల 730 టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 15 కోట్ల 47 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నిత్యం 4 వేల నుండి 6 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 155 లారీల ద్వారా 1 వేయి 600 నుండి 3 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 48 మిల్లులకు, జిల్లాలోని 16 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 3 కోట్ల రూపాయల నుండి 5 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్, గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు.

# న్యాయం చేయాలని గాంధీ విగ్రహం ఎదుట నిరసన

**బెల్లంపల్లి, మే 3 (ప్రభాత సమాచారం)**



బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ప్రెసిడెంట్ ఎండి గౌస్ గాంధీ విగ్రహం ఎదుట భైఠాయించి వినూత్నంగా నిరసన తెలిపారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య తనపై అక్రమంగా కేసు పెట్టించారంటూ గౌస్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. తనకు న్యాయం చేయాలని, తనపై కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ పత్రంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ఫ్లెక్సీ టౌన్ కాంగ్రెస్ కార్యాలయంలో ఉండగా కొద్ది రోజుల క్రితం ఫ్లెక్సీని తొలగించారన్నారు. అంతేకాకుండా తాను ఎమ్మెల్యేను, పార్టీని దూషించినట్లు మల్లయ్య తప్పుడు ఫిర్యాదు చేశాడన్నారు. తనపై పెట్టించిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని, ఈ విషయమై పార్టీ అధిష్టానం తక్షణ జోక్యం చేసుకొని న్యాయం చేయాలన్నారు.

### ఆదిలాబాద్ జిల్లాలో 10 మంది ప్రొఫెషనల్ ఎస్సైలు,
# 11 మంది రెగ్యులర్ ఎస్సైల బదిలీ



**ఆదిలాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆయా మండల పోలీస్ స్టేషన్‌లో గత కొంతకాలంగా పనిచేస్తున్న పదిమంది ప్రొఫెషనల్ ఎస్సైలను, 11 మంది రెగ్యులర్ ఎస్సైలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలో స్థానచలనం పొందిన ఎస్ఐలలో తిరుపతి - ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నుండి డిస్టిక్ స్పెషల్ బ్రాంచ్, అటాచ్ టు ఆదిలాబాద్ టు టౌన్, వి.పురుషోత్తం - జైనథ్ పోలీస్ స్టేషన్ నుండి ఇచ్చోడ పోలీస్ స్టేషన్, పి. దివ్యభారతి - బేల పోలీస్ స్టేషన్ నుండి తాంసి పోలీస్ స్టేషన్, నాగనాథ్ -విఆర్ ఆదిలాబాద్ - బేల, డి.రాధిక - తాంసి నుండి తలమడుగు, పి.గౌతమ్-గుడిహత్నూర్ నుండి జైనథ్ పోలీస్ స్టేషన్, బి. అంజమ్మ-తలమడుగు నుండి డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ ఆదిలాబాద్, అటాచ్ టు ఆదిలాబాద్ వన్ టౌన్, డి. శివరాం-సిరికొండ పోలీస్ స్టేషన్ నుండి ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్ అటాచ్, జి. అప్పారావు-ఆదిలాబాద్ హెడ్ కోటర్స్ నుండి ఉట్నూర్ పోలీస్ స్టేషన్ అటాచ్, డి.పద్మ - వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ఇచ్చోడ పోలీస్ స్టేషన్ అటాచ్, రవీందర్ ఆదిలాబాద్ టు టౌన్ నుండి మావల పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఇందులో మరో 10 మంది ప్రొఫెషనరీ ఎస్సైలు నెల రోజుల పాటు ఎస్‌హెచ్‌ఓలుగా విధులు నిర్వహించనున్నారు. వారిలో కొమ్ము అఖిల్ - నార్నూర్ పోలీస్ స్టేషన్, గడ్డం రమ్య- జైనథ్ పోలీస్ స్టేషన్, బోడ పీర్ సింగ్ నాయక్ - భీంపూర్ పోలీస్ స్టేషన్, శ్రీసాయి- సిరికొండ పోలీస్ స్టేషన్, ప్రణయ్ కుమార్ - మావల పోలీస్ స్టేషన్, పూజ-ఉట్నూర్ పోలీస్ స్టేషన్, సంజయ్‌కుమార్- ఇచ్చోడ పోలీస్ స్టేషన్, రాజశేఖర్ రెడ్డి-బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్, ఎస్ జీవన్ రెడ్డి - గాదిగూడ పోలీస్ స్టేషన్, యనకి మధు కృష్ణ - గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌లున్నారు.

# నీట్ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలి

## 'నీట్' పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీపీ, కలెక్టర్





**మంచిర్యాల, మే 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ కొరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజీవ్ నగర్ లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పరీక్ష నిర్వహణ కొరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల-మంచిర్యాల, తెలంగాణ ఆదర్శ పాఠశాల-రాజీవ్ నగర్, మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షకు 1 వేయి 204 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల లోగా అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. కంట్రోల్ రూమ్, పరీక్ష కేంద్రాలలో సి.సి. కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల వద్ద 144, 163 సెక్షన్లు అమలు చేయడం జరుగుతుందని, పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని తెలిపారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాల రవాణా జరుగుతుందని, ఇందుకు గాను పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, పరీక్ష రోజున ఉదయం 9 గం.ఎల లోపు ప్రశ్నాపత్రాలు కంట్రోల్ రూమ్లో ఉంచాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రంలోనికి నిబంధనల ప్రకారం ఆభరణాలు, మొబైల్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరుగదని, ప్రతి అభ్యర్థిని పరిశీలించి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, మహిళా అభ్యర్థుల పరిశీలన కొరకు మహిళా సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష ముగిసిన తరువాత ఓ.ఎం. ఆర్. పత్రాల తరలింపు నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. 4 పరీక్షా కేంద్రాలలో ఒక్కొక్క పరీక్షా కేంద్రానికి ఒక ముఖ్య పర్యవేక్షకుడు, పాలనా విభాగం నుండి ఒక నోడల్ అధికారి, పోలీసుశాఖ నుండి ఒక నోడల్ అధికారిని నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షా సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని నియమించి, ఓ.ఆర్.ఎస్., అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పారిశుద్ధ్యం, తాగునీరు, దివ్యాంగుల కొరకు వీల్చైర్లు ఇతర అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. పెన్ను, పెన్సిల్, ఎరేజర్, షార్ప్నర్, వైట్నర్ మొదలగు వాటిని అనుమతించడం జరగదని, అభ్యర్థులకు అవసరమైన పెన్నులను పరీక్షా కేంద్రంలోనే అందించడం జరుగుతుందని, ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. నీట్ పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చక్రపాణి పాల్గొన్నారు.



### తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశం

# విజయవంతం చేయాలి

**మందమర్రి, మే 3 (ప్రభాత సమాచారం)**
కరీంనగర్ పట్టణ బస్టాండ్ దగ్గరలోని తారక్ హోటల్లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జరుగనున్న రౌండ్ టేబుల్ సమావేశానికి పట్టణంలోని మలిదశ తెలంగాణ ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరం పట్టణ కన్వీనర్ విజయ్ కుమార్ కోరారు. పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల గ్రౌండ్లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులందరూ తరలి రావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు మండల, జిల్లా కేంద్రాలలో 300 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, 10 లక్షల మాఫీ లోన్ ఇంటి నిర్మాణానికి కేటాయించాలని, ఉద్యమకారుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, తెలంగాణ ఉద్యమకారులందరికి సంక్షేమ పథకాలు వర్తింప జేయాలన్నారు.

# వేసవి శిబిరాలకు ఏర్పాట్ల పరిశీలన



**నిర్మల్, మే 3 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మే నెలలో సమ్మర్ క్యాంపు నిర్వహించబడుతుందని జిల్లా స్థానిక సంస్థల అదన కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శనివారం సమ్మర్ క్యాబ్ నిర్వహించి ఎన్టీఆర్ స్టేడియంను పరిశీలించి సమ్మర్ క్యాంపు నిర్వహణపై అధికారులకు ఆయన పలు సూచనలు సలహాలు అందజేశారు. సమ్మర్ క్యాంప్కు హాజరవుతున్న విద్యార్థులకు అన్ని వస్తువులు కల్పించాలని మున్సిపల్ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

**మంచిర్యాల, మే 3 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల మధ్య కేంద్ర ప్రభుత్వం రూ. 3500 కోట్ల వ్యయంతో నిర్మించిన జాతీయ రహదారి 363 ప్రారంభోత్సవానికి, ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్నగర్ క్రాస్ రోడ్ వద్ద బహిరంగ సభకు ఈ నెల 5న కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో బీజేపీ సీనియర్ నాయకులు రఘునాథ్ వెరబెల్లితో కలిసే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో బీజేపీ కేంద్రంలో 2014లో అధికారంలోకి వచ్చిన అనంతరం దేశ వ్యాప్తంగా జాతీయ రహదారులు అభివృద్ధిలో భాగంగా మంచిర్యాల, చంద్రాపూర్ మధ్య 3500 కోట్ల రూపాయల వ్యయంతో జాతీయ రహదారి




నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేయడానికి ఈనెల 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం కాగజ్ నగర్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి ప్రారంభోత్సవం, బహిరంగ సభకు పెద్ద ఎత్తున బీజేపీ కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఎమాజీ, పురుషోత్తం, పట్టి వెంకట కృష్ణ, అశోక్, కృష్ణమూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.




# రేషన్ దుకాణం ఏర్పాటు చేయండి

**ఖానాపూర్, మే 3 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ మున్సిపాలిటీలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని ఆ కాలనీ ప్రజలు, యంగ్ స్టార్ యూత్ అధ్యక్షుడు షేక్ షకీల్ ఉపాధ్యక్షుడు అలహస్ కోరారు. ఈ మేరకు శనివారం ఖానాపూర్ తహసీల్దార్ సుజాత రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కాలనీలో ప్రస్తుతం 400 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ప్రతినెల రేషన్ బియ్యం తీసుకోవడానికి వినియోగదారులు నానా అవస్థలు పడి దూర భారం, ఆర్థిక భారం, మోయాల్సి వస్తుందని, నిరుపేదలైన డబుల్ బెడ్ రూమ్ కాలనీ ప్రజల అవస్థలను దృష్టిలో పెట్టుకుని ప్రతినెలా రేషన్ సరుకులు కాలనీలోనే అందించే ఏర్పాటు చేయాలని కోరగా, తహసీల్దార్ స్పందించి ఈ నెల నుంచి తాత్కాలికంగా సరుకులు అక్కడే అందించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను

# సద్వినియోగం చేసుకోవాలి

**నిర్మల్, మే 3 (ప్రభాత సమాచారం)**
యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం మాత్రమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ భీమ్ రెడ్డి, ఎఫ్ఎసిహెచ్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్లు అన్నారు. నిర్మల్ రూరల్ మండలంలోని మేడిపల్లి చిట్యాల ముజిగి తాంష గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేసుకుంటున్నామని తెలిపారు. రైతులు పంటను దళాలను విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ నాయకులు ఇమ్మరి నారాయణ పద్మాకర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగర్ నిలిపివేయాలి

**ఆసిఫాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగర్ నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవెణి శంకర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. వైద్య, విద్య, గ్రామీణ ఉపాధి సంక్షేమం పథకాలకు నిధులు తగ్గించి కార్పొరేట్ వ్యవస్థకు రెడ్ కార్పెట్ వేస్తున్నారన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మావోయిస్టులను మట్టుపెట్టేందుకు అత్యాధునిక ఆయుధాలతో పాటు డ్రోన్లతో జల్లెడ పట్టి మారణ హోమం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఆపరేషన్ కగర్ను నిలిపి వేసి మావోలతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి తనకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై బెదిరింపు ధోరణికి పాల్పడుతుందని ఆరోపించారు. సిపిఐ పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 25న మాహా సభలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆత్మకూరి చిరంజీవి, దివాకర్ పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లలో అనర్హులకు చోటు ఇవ్వకూడదు

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఆసిఫాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

నిరుపేదలకు గూడు కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఒక్క అనర్హులు కూడా ఉండకూడదని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలతో కలిసి మండల ప్రత్యేక అధికారులు తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల జాబితా, రేషన్ కార్డుల జారీ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఏ ఒక్క అనర్హుడి పేరు ఉండకూడదని, జాబితా పూర్తి స్పష్టంగా, పారదర్శకంగా రూపొందించాలని, జాబితాలో అవకతవకలు ఉన్నట్లయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పథకం ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే అందించాలని, జాబితాలో అర్హుల పేర్లు మాత్రమే ఉండాలని తెలిపారు. పైలట్గా ఎంపికైన గ్రామాలలో అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ప్రారంభించేలా అధికారులు దృష్టి సారించాలని, జూన్ మాసంలో వర్షాల కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోతాయని, పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు మంజూరైన లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని తెలిపారు. నూతన రేషన్ కార్డుల కొరకు దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులో మంజూరు చేసేలా తహసిల్దార్లు చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

**నిర్మల్, మే 3 (ప్రభాత సమాచారం)**

పోలీస్ శాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతల పర్యవేక్షణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో పోలీసు బలగాల పెరేడ్‌ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లాలో పోలీసు వ్యవస్థ ప్రజలకు రక్షణగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులై ఉండి సమాజ అభివృద్ధి కోసం పోలీస్ శాఖ ముందుకు వెళ్లాలని సూచించారు. ఏఎస్పి రాకేష్ మీనా సిఐలు ప్రవీణ్ కుమార్ గోవర్ధన్ రెడ్డి కృష్ణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబలి పంపిణీ అభినందనీయం



**ఆసిఫాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

ప్రజల దాహార్తి తీర్చేందుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యహియా అంబలి పంపిణీ చేయడం అభినందనీయమని సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ప్రజలకు అంబలి పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం వేసవిలో వారసంత రోజు శనివారం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలకు అంబలి పంపిణీ చేసి వారి దప్పిక తీర్చడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వినాయక, శంకర్, భీమ్రావు నాయకులు రహమాన్, ముబాషీర్, మేరాజ్ తదితరులున్నారు.

## విద్యుత్ భద్రతపై అవగాహన

**నిర్మల్, మే 3 (ప్రభాత సమాచారం)**

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో పట్టణంలో భద్రత వారోత్సవాలను విద్యుత్ శాఖ సిబ్బంది ప్రజలకు వివరించాలని జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సుదర్శనం అన్నారు. శనివారం విద్యుత్ భద్రత వారోత్సవాలు సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించి ఈ నెల ఒకటి నుంచి ఏడు వరకు జిల్లాలో చేపట్టే విద్యుత్ భద్రత వారోత్సవాల ప్రాధాన్యతను ఉద్యోగులకు వివరించారు. విద్యుత్ భద్రతపై ప్రజల్లో చైతన్య కలిగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1912 పై అవగాహన పెంచాలని విద్యుత్ సేవలను వినియోగదారులకు నాణ్యంగా అందించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డిఇ నాగరాజు విద్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



## ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



**రామకృష్ణాపూర్, మే 3 (ప్రభాత సమాచారం)**

కార్మిక సమస్యల పరిష్కారం కొరకు వారి హక్కుల సాధన కోసం నిరంతరం ఐఎన్టియుసి కార్మిక సంఘం పాటుపడుతుందని సీనియర్ నాయకులు తేజావత్ రాంబాబు అన్నారు. ఐఎన్టీయూసీ 78వ ఆవిర్భవ వేడుకలను రామకృష్ణాపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఆవరణలో జెండాను ఆవిష్కరించి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బుచ్చయ్య, ఏరియా సెక్రెటరీ బత్తుల వేణు,ఫిట్ సెక్రటరీలు రాములు, శ్రీనివాస్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టారీతిన మట్టి తవ్వకాలు

**లక్షెట్టిపేట, మే 3 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని ఇటిక్యాల పెద్ద చెరువులో మట్టి తవ్వకాల పేరుతో కొందరు ఇరిగేషన్ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వానికి సీనరేజ్ టాక్స్ పేరిట నామమాత్రపు చలాన్ లు కట్టి కొందరు మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ ఏంఎల్ నాయకులు, చెరువు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మత్స్యకారులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి మట్టి తవ్వకాలకు అనుమతులు ఉంటే గత నెల 27 నుంచే తవ్వకాలు మొదలు పెట్టినట్లు ఆరోపించారు. చెరువు ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ లను నిర్ధారించకుండా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు రియల్ వ్యాపారులకు సహకరిస్తున్నారని ఆరోపించారు.







## రైతుల సౌకర్యార్థం లారీల సంఖ్య పెంపు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మే 3 (ప్రభాత సమాచారం)**

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల మేరకు వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో వరిధాన్యం తరలింపుకు అవసరమైన లారీల సంఖ్యను పెంపొందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్తో కలిసి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, సెక్టార్-1, 2, 3, 4 ట్రాన్స్పోర్ట్ గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియలో జాప్యం జరుగకుండా లారీల సంఖ్య పెంచే విధంగా ట్రాన్స్పోర్ట్ యజమానులు సహకరించాలని తెలిపారు. జిల్లాలోని రైస్మిల్లులలో దిగుమతి ఆలస్యం అవుతున్నట్లయితే కరీంనగర్కు ధాన్యం తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సెక్టార్-1కు 200 లారీలు, సెక్టార్-2కు 100 లారీలు, సెక్టార్-3కు 200 లారీలు, సెక్టార్-4కు 100 లారీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం, రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉంది



**బెల్లంపల్లి, మే 3 (ప్రభాత సమాచారం)**

దేశ భవిష్యతు యువత చేతిలోనే ఉందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అన్నారు. శనివారం బెల్లంపల్లిలో ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాజేష్ అధ్యక్షతన ఏఐవైఎఫ్ జెండాను సీపీఐ పట్టణ కార్యదర్శి రాజమౌళి ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ... దేశంలో సింహభాగం యువత ఉందని రేపటి దేశ భవిష్యత్తు అయిన యువతను విద్య, ఉద్యోగ సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో ప్రోత్సహించి వారి అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. యువతరం కూడా మద్యం గంజాయి డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు బానిసలు అవ్వకుండా మతం మత్తులో పడకుండా జాగ్రత్త పడాలన్నారు. ఆధునిక సాంకేతిక విద్యను సైంటిఫిక్ విజ్ఞానాన్ని మూల కేంద్రంగా చేసుకొని చదువు చదివించు అనే సంకల్పంతో ముందుకు పోవాలన్నారు. దేశ యువతను విద్యావంతులుగా చేసే బాధ్యతను యువతరం తమ భుజాలపై వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, జిల్లా సమితి సభ్యులు చంద్రమాణిక్యం, ఏఐవైఎఫ్ నాయకులు శీను, ముస్తఫా, సత్యనారాయణ పాల్గొన్నారు.

## విద్యతో ఉజ్వల భవిష్యత్తు : ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

విద్యతో ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని ఎమ్మెల్యే కోవా లక్ష్మి అన్నారు. శనివారం ఆసిఫాబాద్ మండలం వావుదాం గ్రామంలో 13.5 లక్షల రూపాయల వ్యయంతో గిరిజన పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు విద్యపై దృష్టి సాధించాలని సూచించారు. చదువుకోవడంతో అభివృద్ధి చెందవచ్చు అన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 90 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ మాజీ ఉపసర్పంచ్ లింభారావు, ఆదివాసి నాయకులు జుగాది రావు, ధర్మారావు, నామ్ దేవ్, కిస్మత్ రావు, ఐటిడిఏ ఏఈ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.





# కేంద్ర మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అధికారులతో సమీక్షా సమావేశంలో కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**ఆసిఫాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

కేంద్రమంత్రుల పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఏఎస్పీ చిత్తరంజన్ లతో కలిసి కేంద్ర మంత్రుల పర్యటన, ఏర్పాట్లపై పోలీస్, రెవెన్యూ, తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 4 వరుసల జాతీయ రహదారి - 363 ను ఈ నెల ఐదవ తేదీన కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి, ఇతర కేంద్ర మంత్రులతో కలిసి ప్రారంభిస్తారని, ఈ నేపథ్యంలో కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో హెలిపాడ్, బహిరంగ సభ సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర మంత్రుల పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, విధులు కేటాయించిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, హెలిపాడ్, సభాస్థలి వద్ద బందోబస్తు ఏర్పాటు, వేదిక అలంకరణ, ప్రముఖుల గ్యాలరీ, మీడియా గ్యాలరీ, అనుమతి పాసులు జారీ, వాహనాల పార్కింగ్, కార్యక్రమానికి వచ్చే ప్రముఖులకు అల్పాహారం, తాగునీరు, సభకు వచ్చే ప్రజలకు భోజనం, తాగునీరు ఎలాంటి రద్దీ లేకుండా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. అదే విధంగా కేంద్ర మంత్రుల పర్యటన ప్రశాంతంగా జరిగేలా వివిధ శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీ య రహదారుల సంస్థ అధికారులు, వివిధ శాఖల అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి అరెస్ట్

**ఆదిలాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న ఎస్ఐ విధులకు ఆటంకం కలిగించిన జిల్లా కేంద్రంలోని మోచేగల్లి కాలనీకి చెందిన వ్యక్తి గటిక ముఖేష్‌ను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సిఐ బి సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల రెండవ తేదీన రాత్రి రవీంద్రనగర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న ఎస్ఐతో వాగ్వాదానికిదిగి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విధులు నిర్వర్తించకుండా ఆటంక పరిచిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**మందమర్రి, మే 3 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ మోడల్ కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్ మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ కోరారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం 10 వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బిపిసి, సిఈసి, ఎంఈసి లలో ప్రతి గ్రూప్ లో 40 సీట్లు ఉన్నాయని, దరఖా స్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చిన మెరిట్ ఆధారంగా ఆయా గ్రూప్ లలో సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా ఆన్‌లైన్‌లో ఈ నెల 5 నుండి 20 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవా లని, ఎంపికైన విద్యార్థుల జాబితా ఈ నెల 26 న కాలేజీలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి ఉందని తెలిపారు.

## వడ దెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

వేసవి తీవ్రత దృష్ట్యా వడ దెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. అధిక ఉష్ణోగ్రత నేప థ్యంలో వైద్య-ఆరోగ్య శాఖతో పాటు, ఇతర శాఖల జిల్లా అధికారులు వడదెబ్బ నివారణపై వారి శాఖల ప్రణాళికకు అనుగుణంగా వేసవి తీవ్రత సమయంలో చేయవలసిన, చేయకూడని వాటి గురించి క్షేత్రస్థాయిలో ప్రతి నివాస ప్రాంతంలో ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావం వల్ల సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమో దవుతున్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటిం చాలని తెలిపారు. మధ్యాహ్నం సమయంలో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని, ఒకవేళ బయటకు వెళ్ళ వలసి వస్తే తలకు టోపీ ధరించడం, తువ్వాలు చుట్టు కోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ వేడిమి సమయాలలో సాధ్యమైనంత వరకు ప్రయాణాలు చేయకూడదని, చల్లదనాన్ని అందించే నీడ ప్రదేశాలలో ఉండాలని అన్నారు. సాధారణ సమయాల కంటే వేసవిలో ఎక్కువ మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోవాలని, తేలికపాటి, తెల్లటి కాటన్ వస్త్రాలను ధరించడం వంటివి చేయాలని, త్వరగా వడదెబ్బకు లోనయ్యే స్వభావం కలిగిన వారు విధిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## కాక శ్రమశక్తి అవార్డు అందుకున్న రాంచందర్

**మందమర్రి, మే 3 (ప్రభాత సమాచారం)**

పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తుంగపిండి రాంచందర్ 'కాక శ్రమశక్తి' అవార్డును అందుకున్నారు. మేడే ను పురస్కరించుకొని ఇటీవల హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో కార్మిక వర్గానికి చేసిన సేవలకు గాను కాక స్మారక శ్రమశక్తి అవార్డు ను చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రాం చందర్ మాట్లాడుతూ... అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా రాం చందర్‌కు అవార్డు రావడం పట్ల ఆయన మిత్రులు సన్నిహితులు హర్షం వ్యక్తం చేశారు.





## ఆగి ఉన్న లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం

**ఒకరి దుర్మరణం.. మరొకరికి తీవ్ర గాయాలు**

**ఆదిలాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

గుడిహత్నూర్ మండలంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీపక్, నితీష్ కుమార్‌లు ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి బీహార్‌కు బయలుదేరారు. శనివారం మన్నూర్ గ్రామ జాతీయ రహదారిపై నిలిచి ఉన్న లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో దీపక్ అక్కడికక్కడే మృతిచెందగా, నితీష్‌కు తీవ్రగాయాలయ్యాయి.

## ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

**ప్రియురాలికి పెళ్లయిన వారం రోజులకే పురుగుల మందు తాగిన ప్రేమ జంట**

**ఆదిలాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

పురుగుల మందు తాగి ఓ ప్రేమజంట ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంకు చెందిన రాజ్ కుమార్, ప్రవల్లికలు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఇటీవల అమ్మాయికి వారి కుటుంబీకులు వివాహం చేశారు. కానీ ప్రియున్ని మర్చిపోలేక, పెళ్లయిన వారం రోజులకే ప్రియుడు రాజ్ కుమార్‌తో కలిసి ఆదిలాబాద్ పట్టణంలోని సీసీఐ ఫ్యాక్టరీ సమీపంలో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేశారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది రిమ్స్ కు తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాగా రిమ్స్‌కు వెళ్లి దర్యాప్తు చేసి, కేసు నమోదు చేసిన్నట్లు వన్ టౌన్ ఎస్ఐ అశోక్ తెలిపారు.





## మొదటి త్రైమాసికంలో 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలి

**1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించాలి..**

**అన్ని ఏరియాల సమీక్ష సమావేశంలో సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్ నాయక్**

**కోల్‌బెల్ట్, మే 3 (ప్రభాత సమాచారం)**

ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తికి పూర్తిగా అనుకూలంగా ఉండే మొదటి త్రైమాసిక కాలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించాలని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ ఏరియాల జనరల్ మేనేజర్‌లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన అన్ని ఏరియాల సమీక్ష సమావేశంలో ఆయన ఉత్పత్తి, బొగ్గు రవాణా తదితర అంశాలపై సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో సాధించిన బొగ్గు రవాణా 5.66 మిలియన్ టన్నులపై 2.7 శాతం వృద్ధితో ఈ ఏప్రిల్ లో 5.81 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సాధించామని, అలాగే గత ఏడాది ఏప్రిల్ నెలలో సాధించిన 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ పై 10.6 శాతం వృద్ధితో ఏప్రిల్ లో 40 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించామని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ లక్ష్యాలు సాధించాలని ఛైర్మన్ సూచించారు. ఒడిశా రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకులో పనిచేసేందుకు సూపర్వైజర్ సిబ్బందిని ఎంపిక చేసి నెల రోజుల్లోగా అక్కడికి పంపించాలని ఆదేశించారు. కొత్తగా నియమించబడిన ఉద్యోగులను భూగర్భ గనుల్లో పనిచేసే విధంగా పోస్టింగులు ఇవ్వాలని కోరారు. సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగినిల సంఖ్య పెరిగిన రీత్యా వీరి నిర్వహణలో నడిపించడానికి ఒక ఓపెన్ కాస్ట్ గనిని, ఒక భూగర్భ గనిని ఎంపిక చేయాలని, ముందుగా ఒక పూర్తి షిఫ్టును కేవలం మహిళల చేతనే నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు రవాణా మరియు నాణ్యతపై కూడా ఆయన సమీక్షించారు. నాణ్యత సరిగా లేనట్లయితే బొగ్గు అమ్మకాలు కుంటుబడతాయని, వినియోగదారులు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. కనుక నాణ్యతపై కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా పూర్తి పనిగంటలు సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ మరియు పర్సనల్) కె.వెంకటేశ్వర్లు, జీఎం (సీపీపీ) ఎ.మనోహర్, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్ చంద్ర పరిగెన్, జీఎం మార్కెటింగ్ రాజశేఖర రావు, కార్పొరేట్ జీఎంలు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.



# మైనర్లు వాహనాలు నడిపితే కేసులు



**ఆదిలాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**
మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో మైనర్ల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మైనర్ స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన 295 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేసి ప్రమాదానికి గురైతే.. బాధితులకు నష్టపరిహారం తల్లిదండ్రులే చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. మాదక ద్రవ్యాలు, చెడు అలవాట్లకు పిల్లలు బానిసలు కాకుండా నిఘా ఉంచాలని సూచించారు. మైనర్ల డ్రైవింగ్ నేరమని, ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మొట్టమొదటిసారిగా మైనర్ డ్రైవింగ్ చేసిన తల్లిదండ్రులకు శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్ లో కౌన్సిలింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ చేయడం నేరమని, చట్టరీత్యా ఇకనుండి కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. మైనర్లకు డ్రైవింగ్ ఇచ్చిన వాహన యజమానులు తల్లిదండ్రులు కేసులలో భాగస్వామ్యం అవుతారని అన్నారు. ఒకవేళ మైనర్ తెలియక ప్రమాదాలకు కారణమైతే ఇన్సూరెన్స్ రాకుండా పోతుందనే విషయాన్ని తెలియజేశారు. మధ్యతరగతి కుటుంబ సభ్యులు 18 సంవత్సరాల పైబడిన పిల్లలకు డ్రైవింగ్ లైసెన్సును తీసుకోవాలని, తగిన సహాయం అందజేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజులపాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 295 మైనర్లు వాహనాలతో పట్టుబడ్డారని, దీంతో 295 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని, ప్రస్తుతం వారి తల్లిదండ్రులకు వాహనాలను ఇవ్వడం జరిగిందని అన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు నడిపే శక్తి ఉండదని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రాత్రిపూట, రోడ్లపై అనవసరంగా తిరగకుండా గమనించాలని కోరారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పకుండా లైసెన్సును కలిగి ఉండాలని, లైసెన్సు తీసుకునే క్రమంలో రోడ్డు నియమాలను, నిబంధనలను నేర్చుకొని లైసెన్స్‌ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పిఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు సిహెచ్ కరుణాకర్, ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, బి శ్రీపాల్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



## విజయ్ దేవరకొండపై జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**జన్నారం, మే 3 (ప్రభాత సమాచారం)**
గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన సినీ నటుడు విజయ్ దేవరకొండ పై చర్య తీసుకోవాలని జన్నారం పోలీస్ స్టేషన్‌లో బంజారా యువజన సేవా సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 26 న జరిగిన 'రెట్రో' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా గిరిజనుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయన్నారు. 500 సంవత్సరాల క్రితం వారు బుద్ధి లేకుండా కొట్టుకున్నారు అనే వ్యాఖ్యలతో పాటు, ఉగ్రవాదులతో పోల్చేలా మాట్లాడటం అసభ్యకంమైనదని, హేయమైనదని, ఈ వాఖ్యలను ఖండిస్తూ అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆయన కోరారు.

## భగీరథ మహర్షి జయంతిని నిర్వహించాలి

**మంచిర్యాల, మే 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు భగీరథ మహర్షి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం తెలిపారు. అధికారులు, ప్రజలు సకాలంలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## గుడిహత్నూర్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన వైద్యాధికారి

**గుడిహత్నూర్, మే 3 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీధర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించి రికార్డుల నిర్వహణ పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలను డాక్టర్ శ్యాంసుందర్ ను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్ట్యా వడదెబ్బల తీవ్రత అధికంగా ఉందని సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు చికిత్స అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ల లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.

## తలపై రాయితో కొట్టి.. మహిళ దారుణ హత్య

**తాండూర్, మే 3 (ప్రభాత సమాచారం)**
పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్లలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. మంచిర్యాల జిల్లా ఐబీ తాండూరుకు చెందిన మోటం సమ్మక్క అనే మహిళ.. భర్త కొన్ని రోజుల క్రిత మరణించాడు. దీంతో ఆమె లక్షింపేట మంటలం దండేపల్లికి చెందిన కనకరాజు అనే వ్యక్తితో సహజీవనం చేస్తున్నది. కల్వచర్ల గ్రామంలో నివాసం ఉంటున్న సమక్క.. రెండు రోజుల క్రితం కనకరాజుతో కలిసి తన చిన్నాన్న ఇంటికి వెళ్లింది. మద్యం మత్తులో ఉన్న కనకరాజు, సమక్కకు మధ్య రాత్రి గొడవ జరిగింది. దీంతో ఆగ్రహం ఊగిపోయిన అతడు సమక్క తలపై ఇటుక రాయితో బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతించెంది. మృతురాలి బంధువులు పోలీసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేఇస దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి జిల్లా దవాఖానకు తరలించారు. కనకరాజు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



**ఇంద్రవెల్లి, మే 3 (ప్రభాత సమాచారం)**
ఇంద్రవెల్లి మండలంలో దొంగలు ఓ ఇంటిలో చొరబడి బంగారం, నగదును దోచుకెళ్లారు. మండల కేంద్రంలోని పూలాజీబాబా ధ్యాన కేంద్రానికి సమీపంలో మండలి బక్కన్న ఇంట్లో దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. బక్కన్న, అతడి భార్య మహారాష్ట్రలో శుభకార్యానికి వెళ్లారు. గమనించిన దొంగలు ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం రాత్రి దొంగలు ఇంటి కిటికిని తొలగించి లోనికి చొరబడి బీరువాను ధ్వంసం చేశారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, రూ.లక్షా 50 వేల నగదును దోచుకెళ్లారు. శనివారం ఇంటికి వచ్చిన బాధిత కుటుంబం చోరీకి గురైన విషయాన్ని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. దొంగను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించి విచారణ చేపట్టామని, కొన్ని ఆధారాలు సేకరించామని వెల్లడించారు.

## నీట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు



**ఆదిలాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**
వైద్య విద్య కళాశాలలో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించే నీట్ పరీక్షకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ శనివారం సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు ఐడి కార్డు, అడ్మిట్ కార్డ్ (హాల్ టికెట్), 2 ఫొటోలు తమ వెంట తీసుకురావాలని కోరారు. ఆదివారం 4 వ తేదీన మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్ష ను ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ అన్ని వసతులు కల్పించాలని, సెంటర్ సూపరిండెంట్‌లను ఆదేశించారు. జిల్లాలో 7 కేంద్రాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలుర, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలికలు, ప్రభుత్వ బాలికల పాఠశాల భూక్తాపూర్, ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆర్ట్స్, కామర్స్, బంగారిగూడ తెలంగాణ మోడల్ స్కూల్, తెలంగాణ రెసిడెన్షియల్ మైనార్టీ స్కూల్‌లో 2 కేంద్రాలలో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 1659 మంది పరీక్షకు హాజరు కానున్నారని, అభ్యర్థులకు పెన్నులు కూడా ఇవ్వడం జరుగుతుందని, అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 1.30వరకు అనుమతిస్తారని, స్ట్రాంగ్‌రూమ్‌ల నుండి ప్రశ్నపత్రాలు, పరీక్ష సామాగ్రిని తరలిస్తారని తెలిపారు.



## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**మందమర్రి, మే 3 (ప్రభాత సమాచారం)**
ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాలని పట్టణ సీఐ శశిధర్ రెడ్డి కోరారు. యాపల్ ఏరియాలో ఇటీవల తరచుగా ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో శనివారం యాపల్ ఏరియా వాసులకు బీఆర్ఎస్ నాయకులు అబ్బాస్ అధ్యక్షతన నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు దాటే సమయంలో ఇరువైపులా చూసి రోడ్డు దాటలని సూచించారు. ట్రాపిక్ నిబంధనలు పాటించాలన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి

**ఆసిఫాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**
ఆస్పిరేషన్ బ్లాక్‌లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం కలెక్టరేట్ లో తిర్యాణి మండల ఆస్పిరేషన్ బ్లాక్ లోనీ 38 అంశాలపై జిల్లా శిశు సంక్షేమ, వైద్య, విద్య, పశుసంవర్ధక, వ్యవసాయ, టి ఫైబర్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గత 2 సంవత్సరాల నుండి తిర్యాణి ఆస్పిరేషన్ బ్లాక్ లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా 38 అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

## నేల రాలిన మామిడి రైతుల ఆశలు

### అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన వైనం - ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

**మంచిర్యాల, మే 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో గురువారం రాత్రి గాలి దుమారం బీభత్సానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న మామిడి కాయలు నేల రాలి రైతుల ఆశలు అడియాశలయ్యాయని పలువురు మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా నెన్నెల, బెల్లంపల్లి, మందమర్రి భీమారం జైపూర్ మండలాలు మామిడి తోటలకు ప్రసిద్ధి. ఇక్కడ మామిడికాయలు మన రాష్ట్రంతో పక్క రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. గత కొద్ది సంవత్సరాలుగా ప్రకృతి మామిడి రైతులపై పగ పెట్టినట్లుగా వ్యవహరిస్తుండటం చేతికొచ్చిన మామిడి ప్రకృతి వైపరీత్యాలతో నేల ర్యాలీ కన్నీరు మిగిలిస్తున్నాయని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.మామిడి తోటలపై ఆధారపడ్డ సుమారు 2000 మంది రైతులు దశాబ్దాలుగా మామిడి తోటలను పెంచుతూ మామిడిపై ఆధారపడి జీవిస్తున్నారు.


**ప్రకృతి వైపరీత్యాల మూలంగా....**

మామిడి రైతులపై ప్రకృతి పగపట్టిందని గత అనేక సంవత్సరాలుగా గాలి దుమారాలు అకాల వర్షాలు మూలంగా మామిడి పంట తీవ్రంగా నష్ట మామిడి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పంట చేతికి సమయానికి ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు కోతుల దండయాత్రలతో పంట చేతికచే పరిస్థితి లేకుండా పోతుందని ఆరుగాలం తోటలో నమ్ముకుని జీవిస్తున్న తమకు ఏదో ఒక రూపంలో నష్టం వాటిల్లుతుందని పలువురు ఆందోళన చెందుతున్నారు.ప్రస్తుత సంవత్సరం పంట అంతంత మాత్రమే ఉండగా వాతావరణం మార్పులు, తేనె మంచు పురుగుల దాడి మామిడి రైతులకు తీవ్ర నష్టానికి గురి చేస్తున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తోడు గురువారం గాలి దుమారం బీభత్సంతో మామిడి కాయలు నేల రాలడమే కాకుండా మామిడి చెట్లు విరిగిపడడంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయని పలువురు మామిడి రైతులు రోదిస్తున్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి...**

ప్రకృతి వైపరిత్యాల మూలంగా మామిడి పండ్లను కోల్పోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా మామిడి పంట ఆశాజనకంగా లేదని పండిన పంటకు మార్కెటింగ్ సౌకర్యం లేక నష్టపోవడం ఒక వంతు అయితే ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట నేల రాలి మామిడి సాగుపై ఆశలు సన్నగిల్లుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మామిడి రైతులను ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

# నేనలా అనలేదు



సూర్య హీరోగా తెరకెక్కిన రెట్రో మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌కు చీఫ్ గెస్టుగా వెళ్లిన విజయ్ దేవరకొండ మాట్లాడిన కామెంట్స్ వివాదాస్పందంగా మారిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ వివాదంపై నటుడు విజయ్ దేవరకొండ స్పందించాడు. రెట్రో ఆడియో లాంచ్ కార్యక్రమంలో తాను చేసిన ఒక వ్యాఖ్యలు కొంతమంది ప్రజలలో ఆందోళన కలిగించిందని.. అది తన దృష్టికి వచ్చింది అని అన్నాడు. ఇప్పుడు ఆ విషయాన్ని తాను హృదయపూర్వకంగా స్పష్టం చేయాలనుకుంటున్నానని తెలిపాడు. ఏ సమాజాన్ని, ముఖ్యంగా మన షెడ్యూల్డ్ తెగలను బాధపెట్టడం తన ఉద్దేశ్యం కాదని అన్నాడు. తాను వారిని ఎంతో గౌరవిస్తాను అని తెలిపాడు. మన దేశ ఐక్యత, మనం ఎలా ముందుకు సాగాలి అనే విషయం గురించి మాత్రమే మాట్లాడానని.. ట్రైబల్ అనే పదాన్ని వేరే సెన్స్‌లో యూజ్ చేసానని పేర్కొన్నాడు.తన వల్ల.. తన సందేశంలోని ఏదైనా అంశం తప్పుగా అర్థం చేసుకోబడినా లేదా బాధ కలిగించేలా ఉన్నా.. దానికి తాను హృదయపూర్వక విచారం వ్యక్తం చేస్తున్నాను అని తెలిపాడు. శాంతి, అభివృద్ధి, ఐక్యత గురించి మాత్రమే తాను మాట్లాడానని పేర్కొన్నాడు. వేరు చేయాలనేది ఎప్పటికీ తన ఉద్దేశం కాదని అన్నాడు. కేవలం ఐకమత్యం కోసమే తాను మాట్లాడానని క్లారిటీ ఇచ్చాడు. దీంతో ఇప్పటికైనా ఈ వివాదానికి చెక్ పడుతుందో లేదో చూడాలి. సూర్య హీరోగా తెరకెక్కిన రెట్రో మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌కు చీఫ్ గెస్టుగా వెళ్లిన విజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో ఆదివాసులపై అభ్యంతరకరమైన కామెంట్స్ చేశారంటూ లాయర్ కిషన్ చౌహాన్.. హీరో విజయ్ దేవరకొండపై ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చౌహాన్ ఫిర్యాదు మేరకు విజయ్ పై కేసు నమోదైంది. హీరో విజయ్ రెట్రో ఈవెంట్ లో పాకిస్తాన్ ఉగ్రవాదుల గురించి మాట్లాడబోయి గిరిజనులు అంటూ కీలక కామెంట్స్ చేశాడు. 500 ఏళ్ల క్రితం గిరిజనులు ఘర్షణ పడినట్లుగా కశ్మీర్‌లో టెర్రరిస్టులు దాడులు, విధ్వంసం సృష్టిస్తూ ఇప్పటికీ అలా కామన్ సెన్స్ లేకుండా, బుద్ధి లేకుండా ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారంటూ కామెంట్స్ చేశాడు. దీంతో అప్పటినుంచి విజయ్ దేవరకొండ క్షమాపణలు చెప్పాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.



అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ్ల సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా సంపంగి పువ్వులు పెట్టుకుని, 90's స్టైల్ శారీ లుక్‌లో ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ్ల సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా సంపంగి పువ్వులు పెట్టుకుని, 90's స్టైల్ శారీ లుక్‌లో ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. a

## సంపంగి లుక్‌లో శోభిత..



## లక్కీ ఛాన్స్ కొట్టేసిన 'కల్కి' బ్యూటీ..

రీసెంట్‌గా మన టాలీవుడ్ లో ఒకే హీరోతో వరుసగా రెండు లేదా అంతకంటే ఎక్కువ సినిమాలు చేసే ఛాన్స్ హీరోయిన్లకి దక్కడం లేదు. సాధారణంగా సినిమా సినిమాకి కొత్త హీరోయిన్లను మార్చేస్తుంటారు మన హీరోలు. కానీ గతంలో ప్రభాస్‌తో రెండు చిత్రాల్లో నటించిన అరుదైన హీరోయిన్ అనుష్క శెట్టి. ఆ తర్వాత అలాంటి అవకాశాన్ని ఎవరూ పొందలేదు. కానీ ఇప్పుడు ఆ లక్కీ ఛాన్స్ దీపిక పదుకోన్‌కు దక్కినట్టే కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రభాస్, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వస్తున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'కల్కి 2898 A.D పార్ట్ 2'(Kalki Part 2) లో దీపిక కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ప్రభాస్ మరో ప్రాజెక్ట్‌లోనూ దీపికకు అవకాశమొచ్చిందట. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందనున్న 'స్పిరిట్'(Spirit) సినిమాలో కూడా ప్రభాస్ సరసన దీపిక నటించబోతోందని సమాచారం. ఇలా ప్రభాస్ సరసన వరుసగా మూడు సినిమాల్లో నటించే అవకాశం దీపిక పదుకోన్‌కు దక్కనుంది.ఇప్పుడు బాలీవుడ్‌లో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. ఇక యానిమల్ సినిమాలో రష్మిక మందన్నాను విభిన్నంగా చూపించిన వంగా, స్పిరిట్ కోసం దీపికకు కూడా ఒక ప్రత్యేకమైన క్యారెక్టర్ ను డిజైన్ చేశాడట. దీపిక పాత్ర స్పిరిట్ సినిమాకే హైలైట్ అవుతుందని టాక్. ఇంట్రెస్టింగ్ విషయం ఏంటంటే, మొదటగా ఈ సినిమా ఆఫర్ దీపిక వద్దకు చాలా ముందే వెళ్లిందట. కానీ అప్పట్లో గర్భవతిగా ఉండటంతో ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పకుంది. అయితే సినిమా షూటింగ్ లేట్ అవ్వడంతో మళ్లీ ఆమెను సంప్రదించి కాల్షీట్లు కన్‌ఫర్మ్ చేసుకున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది.

# నాణ్యమైన విధ్య వైద్యం అందిచడమే నాలక్ష్యం



**మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు**

**లక్షెట్టిపేట, మే 3 (ప్రభాత సమాచారం)**

నియోజికవర్గ ప్రజలకు మంచి నాణ్యమైన వైద్యంతో పాటు విధ్యార్థులకు నాణ్యమైన కార్పోరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే తన లక్ష్యం అని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనంతో పాటు ప్రభుత్వ కళాశాల భవనాల నిర్మాణం పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కూడా విధ్యా, వైద్య రంగంపై ప్రత్యేక దృష్టితో ముందుకు సాగుతుందన్నారు. మన లక్షెట్టిపేట పట్టణంలో రానున్న రోజుల్లో విద్య వైద్యం విషయంలో రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా మన జిల్లా ఉండాలనే లక్ష్యంతో అధికా రులు, నాయకుల పర్యవేక్షణలో పనులు ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చిస్తున్నామన్నారు. ప్రభుత్వ కళాశాల, పాఠశాల భవన నిర్మాణం పనులు ప్రారంభించి సంవత్సరం కూడా పూర్తి కాలేదని కేవలం పది నెలల్లోనే పనులు చివరి దశకు చేరకున్నాయంటే ఇది రాష్ట్రంలోనే రికార్డు అన్నారు. వచ్చె నెల 12వ తారీకున ఆసుపత్రి భవనంతో పాటు కళాశాల, పాఠశాల భవనాలు కూడా ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఆసుపత్రి సూపరిండెంట్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ ఆరీఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, నాయకులు పూర్ణచందర్‌రావు, బొప్పు సుమన్, గడ్డం త్రిమూర్తి, గడ్డం శ్రీనివాస్, చింత అశోక్‌కుమార్, నలిమెల రాజుతో పాటు సంభందిత అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యపై దృష్టి మళ్లించేందుకే ప్రయత్నం

**పోలీస్ గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఏఎస్పీ చిత్తరంజన్**



**ఆసిఫాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

మారుమూల గిరిజన ప్రాంతంలో యువతను విద్య వైపు దృష్టి మళ్లించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. తిర్యాణి మండల కేంద్రంలో పాత పోలీస్ స్టేషన్ భవనానికి మరమ్మతులు చేపట్టి ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ... జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పాత పోలీస్ స్టేషన్‌ను లైబ్రరీగా మార్చి నిరుద్యోగ యువతకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పోటీ పరీక్షల కు సిద్ధమవుతున్న యువతకు సుమారు 200 పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిరుద్యోగ యువత, విద్యార్థులు లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ బుద్దే స్వామి, ఎస్సై శ్రీకాంత్, ఆదివాసీ సంఘాల నాయకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉగ్రదాడికి నిరసనగా మంచిర్యాల బంద్

**- మూసి ఉన్న వాణిజ్య, వ్యాపార సంస్థలు**
**- రాజకీయ పార్టీల నిరసన ర్యాలీలు**



**మంచిర్యాల, మే 3 (ప్రభాత సమాచారం)**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడిని ఖండిస్తూ హిందూ సంఘాల ఐక్య వేదిక, ఛాంబర్ ఆఫ్ కామర్స్, కుల సం ఘాలు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో చేపట్టిన మున్సిపల్ కార్పొరేషన్ బంద్ విజయవంతం అయింది. వ్యాపార సంస్థలు, సినిమా టాకీస్‌లు, హెూటళ్లు, పెట్రోల్ బంక్‌ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొ న్నారు. ఉదయం నుంచి తమ వ్యాపార సంస్థలన్నింటినీ మూకుమ్మడిగా మూసి ఉంచారు. పట్టణంలో షాపులన్నీ మూసి ఉండటంతో వీధులన్నీ బోసిపోయాయి. బంద్ సం దర్భంగా హిందూ ఐక్య వేదిక, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, ఉగ్రవాదుల వైఖరి పట్ల తమ నిరసనను తెలియజే శారు. బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ నుంచి జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నరేష్ పాల్గొని తమ తమ పార్టీల మోటార్ సైకిల్ ర్యాలీలకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలు, వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకు భారత్ వెనకడుగు వేయవద్దని, భారతీయులంతా ప్రభుత్వనికి మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేశారు.

# 5 నుంచి భూ భారతి రెవెన్యు సదస్సులు

**ఆదిలాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంలో భాగంగా ఈ నెల 5 నుంచి భూ భారతి ఈ రెవెన్యూ సదస్సులు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భూ భారతి గ్రామ రెవె న్యు సదస్సులు జిల్లాలో ముందుగా పైలెట్ ప్రా జెక్టుగా భోరజ్ మండలంను ఎంపిక చేసినట్లు తెలిపారు. మూడు టీములతో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు శనివారం అధికారులతో నిర్వహించిన గూగుల్ మీట్ ద్వారా అ ధికారులకు ఆదేశాలు జారీచేశారు. గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**ఆదిలాబాద్, మే 3 (ప్రభాత సమాచారం)**

ఆడపిల్లల పెళ్లిళ్లు చేసి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తల్లిదండ్రులు ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదిలాబాద్ నియోజకవ ర్గంలోని జైనథ్, బేల, ఆదిలాబాద్ రూరల్, బోరజ్ మండ లంలోని లబ్ధిదారులకు శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పు చేసి ఆడబిడ్డలకు పెళ్ళిచేసిన తల్లిదండ్రులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ సహాయాన్ని పెళ్లికి ముందే అందించేలా చూడాలని కోరారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## నూతన కోర్టు భవన నిర్మాణ
# పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏ వీరయ్య పర్యటన**

**బెల్లంపల్లి, మే 3 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య శనివారం బెల్లంపల్లిలో పర్యటించారు. బెల్లంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సివిల్ కోర్టు భవనాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నూతన కోర్టు భవనాల పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లి పట్టణంలోని మున్సిఫ్ కోర్టు, నూతన కోర్టు భవనాలను జిల్లా ఫస్ట్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్ రెడ్డి, స్థానిక మున్సిఫ్ కో ర్ట్ జడ్జి ముఖేష్‌తో కలిసి పరిశీలించారు. అంతకు ముందు జిల్లా కోర్టు ప్రధానన్యాయమూర్తి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సివిల్ కోర్టులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లి పట్టణం లో నిర్మిస్తున్న నూతన కోర్టు భవనాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయన్నారు. కేసులు సత్వరంగా పరిష్కరించడంలో స్థానిక న్యాయమూర్తి, న్యాయ వాదులు చేస్తున్న



కృషిని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చేను రవికుమార్, సీనియర్ న్యాయవాదులు రాము, అశోక్, సంగీత, సాయికుమార్, అనీల్, మమత, సునీల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.